

'అమెరికా' ఆశలకు కళ్లెం!

అమెరికా వెళ్లాలని నేటియువత లక్ష్యంగా పెట్టుకుని చదువుతోంది. అయితే ప్రస్తుతం అధ్యక్షుడి ట్రంప్ చర్యలతో వారి మనసుల్లో అలజడి మొదలైంది. 8లో▸



వేసవి క్రీడా శిబిరాలకు కసరత్తు

వేసవి సెలవులు సమీపిస్తుండడంతో వేసవి క్రీడా శిబిరాలకు జిల్లా యువజన, క్రీడాశాఖ కసరత్తు ప్రారంభించింది. మే 1 నుంచి 31 వర కు ఈ శిబిరాలు నిర్వహిస్తారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
40.4 /26.6

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. ద్రోణి ప్రభావంతో వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి కూడా వేడి సెగలు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ఎంజేపీ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌సీవో శ్రీధర్

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్‌లో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ కర్త (ఆర్‌సీవో)శ్రీధర్ గురువారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. నూతనంగా ఆర్‌సీవోగా బాధ్యతలు చేపట్టి మొదటిసారి పాఠశాలకు వచ్చిన ఆయనను, పాఠశాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఇందులో డీసీవో గీతారాణి, ప్రిన్సిపాల్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేదలపై పన్నులు.. సంపన్నులకు రాయితీలు



నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రస్తుత ప్రభుత్వాలు పేదలపై పన్నులు వేస్తూ సంపన్నులకు రాయితీలు ప్రకటిస్తున్నాయని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి కె.రాజన్న అన్నారు. వంట గ్యాస్ ధరలు రూ.50, డీజిల్ ,పెట్రోల్‌పై రూ.2 సుంకం పెంచడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో మినీ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట కట్టెల పొయితో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కె.రాజన్న మాట్లాడుతూ పెంచిన ధరలు తగ్గించకపోతే అన్ని పార్టీలు సంఘాలతో కలిపి పోరాటం చేస్తామన్నారు. అంతర్జాతీయంగా డీజిల్ గ్యాస్ ధరలు తగ్గినా దేశంలో ధరలు పెంచి ప్రజలపై భారం వేయడం దుర్మార్గమన్నారు. ఈ చర్యలతో నిత్యావసర సరుకులు ధరలు పెరుగుతున్నాయని, నిరుద్యోగం ఆకలి, దారిద్రం, ద్రవ్యోల్బణం లాంటి సమస్యలను అదుపు చేయకుండా వ్యవహరిస్తున్నారన్నారు. నిరసనలో నాయకులు ఎం.బక్కన్న, ఆర్.రామలక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రేష్మ, దేవక్క పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి



ఆశ కార్యకర్తలను సన్మానిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

నిర్మల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సురేష్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ అన్నారు. నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు, సాధారణ కాన్పులు పెంచేలా కృషిచేసిన ఆశ కార్యకర్తలు సవిత, రుక్మిణి, మమత ను గురువారం సన్మానించారు. ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమోద్‌చంద్రారెడ్డి, ఆర్‌ఎంవో డాక్టర్ అరవింద్ , డాక్టర్లు శ్రీనివాస్, సౌమ్య, రాకేష్, ప్రియాంక, శైలజ, నర్సింగ్ అధికారులు అన్నపూర్ణ, జ్యోతి, లలిత పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకుంటాం



రైతు కుటుంబంతో మాట్లాడుతున్న డీఏవో

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న రైతు పతాని నడ్పి మల్లన్న కుటుంబాన్ని ఆదుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్‌తో కలిసి గురువారం పరామర్శించారు. ఆత్మహత్యకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మల్లన్న వ్యవసాయ భూమిలో వేసి న బోర్లను పరిశీలించారు. రైతు చేసిన అప్పులు గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలు సుకున్నారు. ప్రైవేటు వ్యక్తులు, బ్యాంకులో ఎంత మేరకు అప్పులు ఉన్నయని ఖాతాల ను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. వారివెంట ము ధోల్ సీఐ మల్లేశ్, ఎస్సై అశోక్, ఏసీవో మౌనిక ఉన్నారు.

అక్కడే నిప్పపెట్టారు..!



మందపల్లిలో కాలిపోయిన మొక్కలు

పెంబి: మండలంలోని మందపల్లి పల్లె ప్రకృతివనం చూడటానికి బాగానే ఉన్నా.. నిర్వహణలోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఎండిపడిన ఆకులను అక్కడే కాల్చేయడంతో పక్కనున్న మొక్కలు కూడా కాలిపోయాయి.

భైంసా బల్దియాలో..



భైంసాలో పట్టణ ప్రకృతివనం తీరిది..

భైంసాటౌన్: పట్టణంలో వార్డుకో ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. స్థలాలు లేక తూతూమంత్రంగా కొన్ని మొక్కలు నాటి, రెండు సిమెంట్ బెంచీలు వేసి చేతులు దులుపుకున్నారు. కొన్నిచోట్ల ఆనవాళ్లు కోల్పోగా, మరికొన్ని నిరుపయోగంగా మారాయి.

ఖానాపూర్ మున్సిపల్‌లో..



ఖానాపూర్‌లో బోర్డు కూడా ఇలా..

ఖానాపూర్: పట్టణంలో రెండు పట్టణ ప్రకృతి వనాలూ ఆనవాళ్లు కోల్పోయి బోర్డులు మాత్రమే మిగిలాయి. స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలోని పార్కు ఇటీవల ప్రారంభించడంతో దాని నిర్వహణ సక్రమంగానే ఉంది. ప్రకృతివనాలు మాత్రం పత్తాలేవు.

జిల్లా కేంద్రంలో..



దివ్యనగర్‌లో పార్కు దుస్థితి

నిర్మల్‌టౌన్: పేరుకు జిల్లా కేంద్రమన్నట్లే కానీ.. ఒక్క పార్కూ లేదిక్కడ. గతంలో అభివృద్ధి చేసిన దివ్యనగర్ పట్టణ పార్కు కూడా నిర్వహణ లేక చెత్తకుప్పగా మారింది. భాగ్యనగర్, ఇంద్రానగర్ పార్కులూ అలాగే ఉన్నాయి.

ప్రకృతివనం.. పట్టని వైనం

నిర్మల్: వేసవి సెలవులు వస్తున్నాయి. పిల్లలు, పెద్దలు కాసింత సేదతీరుతూ నీడ పట్టున ఆడుకుందామంటే.. జిల్లాలో ఎక్కడా అవకాశం లేకుండా పోయింది. జిల్లావ్యాప్తంగా 582పల్లె/పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. కానీ.. పట్టణాల్లో పార్కుల నిర్వహణ ఎవరికీ పట్టడం లేదు. పల్లెల్లో సైతం ప్రకృతివనాలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. కనీసం పట్టించుకునే వారు లేక జిల్లాలో ఇప్పుడు 'ఆహ్లాదమా.. అడ్రస్ ఎక్కడ..!?' అని అడగాల్సి వస్తోంది. జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో, పలు మండలాల్లోని పల్లె ప్రకృతివనాలపై 'సాక్షి విజిట్' నిర్వహించింది. ఇందులో కొన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతివనాలు నిండుగా పచ్చదనంతో ఆకట్టుకుంటున్నాయి. గ్రామస్తులు, అక్కడి అధికారులు, సిబ్బంది వాటిని కాపాడుకుంటూ నీడపట్టున అప్పుడప్పుడు సేదతీరుతున్నారు. చాలా ఊళ్లలో అసలు.. ఇది ప్రకృతివనమేనా..! అన్నట్లుగా ఆనవాళ్లు సైతం కోల్పోయాయి.

- ఆహ్లాదమా.. అడ్రసెక్కడా..!?
- వేసవిలో సేదతీరే.. చోటేది..!?
- ఎండిన చెట్లు.. కోల్పోతున్న ఆనవాళ్లు
- పట్టించుకున్నచోట పచ్చదనం
- ప్రకృతివనాలపై 'సాక్షి' విజిట్

ఎండిన ప్రకృతివనం..

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెంలో నీళ్లు లేక పల్లె ప్రకృతివనం ఎండిపోయింది. పచ్చగా ఉండాల్సిన పార్కు నీళ్ల లేక కళావిహీనంగా మారింది.



దేవునిగూడెంలో ఎండిపోయిన మొక్కలు

ఆహ్లాదం.. బహుదూరం

నిర్మల్ నర్సాపూర్(జి) మండల కేంద్రంలో పల్లెప్రకృతివనం ఊరి నుంచి ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో ఉంది. పర్లేదు.. అక్కడిదాకా వెళ్లి కాసేపు ప్రకృతిలో స్వచ్ఛమైన గాలి పీల్చుకుందామంటే.. పక్కనే డంపింగ్‌యార్డు ఏర్పాటు చేశారు. ప్రకృతివనం పచ్చగానే ఉన్నా.. పర్యావరణం సరిగా లేకపోవడంతో ఎవరూ వెళ్లే పరిస్థితి లేదు.

'రూర్బన్' తీరిది..

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయ ఆవరణలో రూ.60 లక్షల రూర్బన్ నిధులతో పార్కును ఏర్పాటు చేశారు. ఏమాత్రం నిర్వహణ లేదిక్కడ. చెట్లు ఎండిపోయాయి. ఫౌంటేన్, ఆటవస్తువులు, సిమెంట్ బెంచీలు, జిమ్ పరికరాలు విరిగిపోయాయి.

బాగానే ఉన్నా..!

సోన్: మండలంలోని న్యూవెల్మల్, బొప్పారం, కూచన్‌పల్లి, సంగంపేట, మాదాపూర్ పల్లెప్రకృతి వనాలను విజిట్ చేయగా, చూడటానికి బాగానే ఉన్నా.. సరిపడా నీరందక మొక్కలు ఎండుతున్నాయి. ఇంకా కొంత నిర్వహణ చేయాల్సి అవసరం ఉంది.

చెట్లు మాత్రమే ఉన్నాయి..

సారంగాపూర్: మండలంలోని జామ్, దుర్గానగర్‌లో పల్లె ప్రకృతివనాల్లో చెట్లు ఉన్నా.. ఏమాత్రం పచ్చదనం, కనీస సౌకర్యాలు లేవు. చూడటానికి కళావిహీనంగా మారాయి.

మియావాకీ.. సౌకర్యాలేవీ!

తానూరు: మండలం ఉమ్రి(కె)లో పచ్చని చెట్ల మధ్య వాకింగ్ చేయడానికి మియావాకీ పద్ధతిలో ప్రకృతివనం ఏర్పాటు చేశారు. జిల్లాలో పేరొందిన ఈ పార్కు బాగానే ఉన్నా.. పిల్లల ఆటవస్తువులు, జిమ్‌పరికరాల వంటి సౌకర్యాలు కల్పించాలి.

మాటేగాం.. నిర్వహణలోపం

భైంసారూరల్: మండలం మాటేగాంలో పచ్చని ప్రకృతివనం ఉన్నా.. నిర్వహణ, పరిశుభ్రత లోపాలతో ఆకట్టుకోవడం లేదు.

అక్కడలా.. ఇక్కడిలా..



రాచాపూర్‌లో ప్రకృతివనం ఇలా..

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్, వడ్యాల్ గ్రామాల్లో పరిశీలించగా, ఊరికి దూరంగా ఉన్నాయి. పట్టించుకునే నాథుడు లేక, అవి పల్లె ప్రకృతి వనాలేనా..! అన్నట్లు తయారయ్యాయి. ఇదే మండలంలోని పొట్టపల్లి(కె)లో నిండుగా పచ్చనిచెట్లతో కళకళలాడుతోంది. జిల్లాలో ఉత్తమ పల్లె ప్రకృతివనంగా గుర్తింపుపొందింది.

అమలులోకి స్లాట్ బుకింగ్

- తొలిరోజు 16 రిజిస్ట్రేషన్లు
- రూ.3,73,987 ఆదాయం

నిర్మల్‌చైన్‌గేట్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖలో కొత్త విధానం అమల్లోకి వచ్చింది. దళారుల ప్రమేయానికి చెక్ పెట్టడంతోపాటు క్రయవిక్రయదారులకు సమయం ఆదా చేసే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్ విధానం గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన పైలట్ సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో మొదలైంది. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల కోసం గంటలకొద్దీ నిరీక్షించకుండా డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ (డీక్యూఎంఎస్) విధానం దోహదపడనుంది. పాత విధానంపై రాష్ట్ర వ్యాప్తంగా ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం కొత్తగా స్లాట్‌బుకింగ్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని నిర్మల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఎంపిక చేశారు. దశలవారీగా మిగతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ రిజిస్ట్రార్ గురువారం నిర్మల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నూతన సేవలను ప్రారంభించారు. తొలి రోజు 16 స్లాట్ బుకింగ్‌లు జరగగా రూ.3,73,987 ఆదాయం సమకూరింది.

ఇంటర్ మూల్యాంకనం పూర్తి



డీఐఈవోను సన్మానించిన అధ్యాపకులు

నిర్మల్ రూరల్: జిల్లాలో ఇంటర్ మూల్యాంకనం గురువారంతో ముగిసింది. జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత నెల 21న ప్రారంభమై సుమారు 21 రోజుల పాటు కొనసాగింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 1,35,000 జవాబు పత్రాలను అధ్యాపకులు మూల్యాంకనం చేశారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 200 మంది అధ్యాపకులు స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్నారు. మరో రెండు రోజులపాటు మాస్ కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. మూల్యాంకనం విజయవంతంగా పూర్తి చేసినందుకు డీఐఈవో జాదవ్ పరుశురాంను గజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. మరో 12 రోజుల్లో ఇంటర్ ఫలితాలు ప్రభుత్వం విడుదల చేసే అవకాశం ఉందని డీఐఈవో తెలిపారు.

ఐటీడీఏ పీవోకు నివేదిక

- ఇటీవల ఆశ్రమ పాఠశాలల్లో తనిఖీ
- సమగ్ర నివేదిక అందించిన పారాలీగల్ వాలంటీర్లు
- అభినందించిన కలెక్టర్
- త్వరలో ఆస్పత్రుల పరిశీలన

నిర్మల్: జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వేసవి సెలవుల్లో పరిష్కరించాలని జిల్లా పారాలీగల్ వాలంటీర్ల బృందం సభ్యులు గురువారం ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తాను కోరారు. జిల్లా న్యాయసేవాసాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి రాధిక ఆదేశాల మేరకు ఇటీవల 22 మందితో కూడిన పారాలీగల్ వాలంటీర్లు జిల్లాలోని 17 ఆశ్రమ పాఠశాలలను పరిశీలించారు. ఈమేరకు సదరు నివేదికను న్యాయమూర్తితోపాటు కలెక్టర్ అభిలాషఅభినవ్‌కు అందించారు. అనంతరం ఉట్నూర్ వెళ్లి ఐటీడీఏ పీవోను కలిసి సమగ్ర నివేదిక అందించారు. జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో పరిస్థితులను బృందం సభ్యుడు, పెన్షనర్స్ సంఘం జాతీయనేత ఎంసీ.లింగన్న ఆమెకు వివరించారు.



ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాకు నివేదిక అందిస్తున్న పారాలీగల్ వాలంటీర్ల బృందం

త్వరలో ఆస్పత్రుల పరిశీలన..

పారాలీగల్ వాలంటీర్ల సేవలను కలెక్టర్ అభిలాషఅభినవ్ ప్రశంసించారు. బృందంలో ఉన్నవారందరూ రిటైర్డ్ అయిన పెన్షనర్స్ ఉన్నప్పటికీ పకడ్బందీగా సర్వీస్ చేస్తున్నారని అభినందించారు. ఆశ్రమ పాఠశాలలపై ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు చేపడతామన్నారు. న్యాయసేవాసాధికార సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు త్వరలో ప్రభుత్వ ఆస్పత్రుల పరిశీలన చేపట్టనున్న నేపథ్యంలో బృందం సభ్యులతో కలిసి కలెక్టర్ సంబంధిత వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పారాలీగల్ వాలంటీర్ల బృందం సభ్యులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

జిల్లాలో వడగండ్లు

జిల్లాలో గురువారం సాయంత్రం వడగండ్ల వాన కురిసింది. ఈదురు గాలులతో కొన్ని మండలాల్లో రాళ్ల వర్షం కురిసింది. దీంతో ప్రజలు, రైతులు ఇబ్బంది పడ్డారు. కోతకు వచ్చిన పంటలు నేలవాలాయి. ఇప్పటికే కోసి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. కుంటాల మండలంపెంచికల్ పాడ్ ,అందాకూర్ గ్రామాల్లో రాళ్ల వాన కురిసింది. మొక్కజొన్న తడిసి ముద్దయింది. కోత దశకు వచ్చిన జొన్న నేల వాలింది. భైంసారూరల్ మండలం తిమ్మాపూర్, వానల్‌పాడ్, పేండ్‌పెల్లి, వాటోలి, సుంక్లి తదితర గ్రామాల్లో బలమైన గాలులతో వర్షం కురిసింది. చేతికి వచ్చిన మొక్కజొన్న కల్లాల్లో తడిసింది. లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్, కన్కపూర్, రాయపూర్‌కాండ్లీ, ధర్మోరా, పంచగుడి, పిప్రి, బామ్ని(కె), లోకేశ్వరం తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మొక్కజొన్న, జొన్న, నువ్వు, వరి పంటలు నేల వాలాయి. కల్లాల్లో అరబెట్టిన మక్కలు కొంత మేరకు తడిసిపోయాయి.ఖానాపూర్ మండలంలో వాతావరణం రోజంతా చల్లబడి ఉంది. సాయంత్రం బలమైన గాలులు వీచాయి. దీంతో పలు దుకాణాల బోర్డులు కొట్టుకుపోయాయి. మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి.

– కుంటాల/భైంసారూరల్/లోకేశ్వరం/ఖానాపూర్



తిమ్మాపూర్‌లో కల్లంలో నీటిని తొలగిస్తున్న రైతులు



ధర్మోరాలో మొక్కజొన్నను అరబెడుతున్న రైతులు



కుంటాలలో నీటిని వేరు చేస్తున్న రైతులు



పెంచికల్ పాడ్‌లో కురిసిన రాళ్ల వాన

నీటి వనరులను సంరక్షించుకోవాలి



కొరిటికల్‌లో వాటర్‌షెడ్ యాత్రను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



జౌళి గ్రామంలో వాటర్‌షెడ్ యాత్రను ప్రారంభిస్తున్న డీపీవో శ్రీనివాస్

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా పంచాయతీ, ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్
- వాటర్‌షెడ్ యాత్రలు ప్రారంభం

మామడ/సారంగపూర్: నీటి వనరులను సంరక్షణతో పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జిల్లా పంచాయతీ, ఇన్‌చార్జి డీఆర్డీవో శ్రీనివాస్‌అన్నారు. మామడ మండలంలోని కొరిటికల్ గ్రామం, సారంగాపూర్ మండలం జౌళి గ్రామంలో ప్రధాన మంత్రి కృషి సంచాయి యోజన పథకంలో భాగంగా వాటర్‌షెడ్ యాత్రను గురువారం వేర్వేరుగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటియొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. వాతావరణ మార్పుల కారణంగా సకాలంలో వర్షాలు కురవకుంటే సాగుపై ప్రభావం చూపుతుందన్నారు. వర్షం నీటిని కాపాడుకోవడానికి నీటి కుంటలు, రాళ్ల కట్టలు, కందకాలు, ఫాం పాండ్, చిన్న నీటి కంటలు, చెక్ డ్యాంలు నిర్మించాలన్నారు. ఇలా చేస్తే వర్షపు నీరు భూమిలో ఇంకుతుందని తెలిపారు. వాటర్‌షెడ్‌ల ద్వారా నిలిచిన నీటిని పచ్చదనం పెంపొందించేందుకు, భూగర్భ జలాల పెంపునకు, వ్యవసాయానికి వినియోగించకోవచ్చని వివరించారు. అనంతరం నీటి విలువను తెలిపే వీడియోను ప్రజలకు చూపించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్, డీఎల్పీవో అజీజ్‌ఖాన్, ఏపీడీ ఓస ప్రసాద్, సెర్ప్ ఏపీఎం అరుణ, సారంగాపూర్ మండల ప్రత్యేకాధికారి బాలిక్ అహ్మద్, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రావు, తహశీల్దార్ శ్రీదేవి, ఎంపీఓ అజీజ్‌ఖాన్, ఏపీవో లక్ష్మారెడ్డి, డీఆర్వో నజీర్‌ఖాన్, స్థానిక నాయకులు బాపురెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూడీఐడీ ఎంపిక శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల కోసం(యూడీఐడీ)ఎంపిక శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఎంపిక శిబిరాన్ని గురువారం సందర్శించారు. వైద్యాధికారులకు సూచనలు చేశారు. జిల్లాలో యూడీఐడీ కార్డుల మంజూరుకు రెండు రోజులు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం దృష్టిలోపం ఉన్న దివ్యాంగులకు శిబిరం నిర్వహించామని, శుక్రవారం ఆర్థోపెడిక్ విభాగపు దివ్యాంగులకు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గురువారం శిబిరానికి 20 మంది దివ్యాంగులకు స్లాట్ బుక్ చేసుకోగా 12 మంది మాత్రమే శిబిరానికి హాజరైనట్లు తెలిపారు. హాజరు కానీ 8 మంది మళ్లీ శిబిరాన్ని ఏర్పాటు చేసినప్పుడు ముందుగా స్లాట్ ఎంపిక చేసుకొని రావాలన్నారు.

అర్ధశతాబ్దపు ఆత్మీయ సమ్మేళనం!



వారు 1975–76లో సోమవార్‌పేట బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు. వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు. కొంతమంది రిటైర్ కూడా అయ్యారు. అర్ధ శతాబ్దం తర్వాత తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కలుసుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో వారికోసం ఆరా తీశారు. చిరునామా తెలుసుకుని వారి ఇంటికి వచ్చారు. పూర్వ విద్యార్థులంతా వారంతా గురువారం ద్యాగవాడలో ఒక్కచోట కలిశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నరసమ్మ, మలా మీనన్(సుమారు 90 ఏళ్లు)ను ఆత్మీయంగా సత్కరించారు. పాదాభివందనం చేశారు. ఇందులో పూర్వ విద్యార్థులు సుజాత దేవి, జయశ్రీ, భాగ్యలక్ష్మి, వీణ, కవిత, కృష్ణకుమారి, సుజాత, హేమలత, సునీత, ప్రభలత, శోభ, ఇందుమతి, మాయ, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

– నిర్మల్‌ఖిల్లా



క్లుప్తంగా

గంజాయి విక్రేతపై కేసు

నేరడిగొండ: మండలంలోని దేవులతండా గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జుల్ఫేఖార్ అహ్మద్ తెలిపారు. గ్రామంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దేవులతండాలో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జాట్వే మాన్‌సింగ్ అనే వ్యక్తి ఇంటి వద్ద సుమారు 325 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయి అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బోథ్‌లో మరొకరిపై..

బోథ్: మండల కేంద్రంలో గంజాయి విక్రయించడానికి వచ్చిన మట్ట అందు అనే వ్యక్తిని ఎస్సై ప్రవీణ్‌కుమార్ పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని డేరా గ్రామానికి చెందిన మట్ట అందు మండల కేంద్రానికి గురువారం గంజాయి విక్రయించేందుకు వచ్చాడు. మార్కెట్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. అతడి వద్దకు వెళ్లి పరిశీలించగా రూ.3 వేల విలువైన 125 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఏసీసీ క్వారీలో కారు బోల్తా

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ క్వారీ లోయలో కారు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న వారు బెంగళూర్‌కు చెందిన వారిగా తెలుస్తోంది. ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌ను తప్పించబోయి లోయలోకి దూసుకెళ్లింది. మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి, కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. సీఐ ప్రమోద్‌రావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కారు లోయలోకి దూసుకెళ్లి చెట్ల పొదల్లో ఆగిపోయినట్లుగా ఉంది. కారులో ఎవరూ లేకపోవడంతో వారి ఆచూకీ కోసం స్థానిక ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య


రాజయ్య (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బెల్లంపల్లి మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాత బెల్లంపల్లి గ్రామానికి చెందిన నలిమెల రాజయ్య (57) వ్యవసాయం చేయడంతోపాటు వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. షాపు సక్రమంగా నడవకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తన కూతురు, కుమారుడి వివాహాలకు చేసిన అప్పులు తీర్చలేక నిత్యం మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో రాజయ్య ఈ నెల 3న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రాజయ్యను మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రాజయ్య కుమారుడు వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జేసీబీ ధ్వంసం చేసి దాడికి పాల్పడ్డవారిపై కేసు

మంచిర్యాలక్రైం: కోర్టు ఉత్తర్వులు దిక్కరించి అక్రమంగా ఓ వ్యక్తి భూమిలోకి చొరబడి జేసీబీని ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినిత గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు చెందిన తూటి శ్రీనివాస్ 301 సర్వే నంబర్‌లో 10 గుంటల భూమిని 2018లో గాండ్ల చంద్రమౌళి వద్ద కొనుగోలు చేశాడు. ఈ భూమిని కొద్దిరోజుల క్రితం గద్దరాగడికి చెందిన బొంకూరి సరోజ, ఆమె కుటుంబ సభ్యులు కబ్జా చేసే ప్రయత్నం చేయగా శ్రీనివాస్ కోర్టును ఆశ్రయించాడు. కోర్టు శ్రీనివాస్‌కు అనుకూలంగా ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. దీంతో ఈ నెల 9న శ్రీనివాస్ జేసీబీతో సదరు భూమిని చదును చేస్తున్నాడు. ఈక్రమంలో బొంకూరి శ్రీనివాస్, దేవిరెడ్డి మహేందర్‌రెడ్డితో పాటు మరి కొందరు జేసీబీపై రాళ్లతో దాడి చేసి ధ్వంసం చేశారు. ఈ దాడిలో సుమారు రూ.25వేల నష్టం జరిగింది. ఈ మేరకు తూటి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌తోపాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మట్కా నిర్వాహకుడి షెడ్ కూల్చివేతకు ఆదేశం

ఆదిలాబాద్‌టౌన్: మట్కా నిర్వాహకుడి షెడ్ కూల్చివేతకు ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన షేక్ రంజాని నివాసంలో మట్కా నిర్వహిస్తూ ఎనిమిది మంది పట్టుబడ్డారు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని టూటౌన్ పోలీసులు ఆర్డీవోకు లేఖ రాశారు. ఆర్డీవో స్పందిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 48 గంటల్లో షెడ్ తొలగించాలని, లేని పక్షంలో జప్తు చేస్తామని తెలిపారు. ఎవరైనా మట్కా, జూదం నిర్వాహకులకు ఆశ్రయం కల్పించినా, అసాంఘిక కార్యకలాపాలకు సహకరించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

‘అమెరికా’ ఆశలకు కళ్లెం!

- వీసా కోసం నూతన ఆంక్షలు
- స్టడీ కోసం వెళ్లే వారికి నిరాశే..
- ఓపీటీ రద్దుకు ట్రంప్ యత్నం
- ఉమ్మడి జిల్లావాసుల్లో కలవరం


అమెరికాలో భారతీయ విద్యార్థులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: భూతల స్వర్గం యూఎస్‌ఏ వెళ్లాలని ప్రతి ఒక్కరూ లక్ష్యంగా పెట్టుకుని చదువుతుంటారు. ఉన్నత చదువుల కోసం వెళ్లి అక్కడే ఉద్యోగాల కోసం ప్రయత్నించి స్థిరపడాలని ఆశ పడతారు. అయితే ప్రస్తుతం అలాంటి వారి మనసుల్లో అలజడి మొదలైంది. దీనికంతటికి కారణం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇతర దేశాల నుంచి ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం వచ్చే వారికి అమెరికా ప్రవేశం విషయంలో పలు నిబంధనలు విధించనుండటమే. ఇదే అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ మీడియాలోనూ వార్తలు వస్తుండడంతో ఉమ్మడి జిల్లావాసుల్లోనూ కలవరం మొదలైంది. బీఈ, బీటెక్ లాంటి చదువులు చదివి పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఎమ్మెస్ లాంటి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లేందుకు చాలామంది విద్యార్థులు, యువత ఆసక్తి కనబర్చుతుంటారు. కాగా, అక్కడికి వెళ్లినవారు తమ చదువులు పూర్తయిన తర్వాత మూడేళ్లపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వెతుక్కునేందుకు ఇదివరకు అవకాశం ఉండేది. అలాంటి అవకాశాన్ని ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెనింగ్)గా పేర్కొంటారు. ఈ ఓపీటీ అనుమతిని రద్దు చేసేందుకు ట్రంప్ సర్కారు బిల్లు ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతోంది.

ఉమ్మడి జిల్లావాసుల్లోనూ కలవరం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు పీజీ చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడే ఉపాధి అవకాశాలు వెతుక్కునే పనిలో ఉన్నారు. అలాంటి వారందరిలోనూ ప్రస్తుత పరిస్థితితో కలవరం మొదలైంది. ప్రస్తుతం ఉన్న ఓపీటీ రద్దు అంశాన్ని అమెరికా కాంగ్రెస్ సభలో ప్రవేశపెట్టి బిల్లును ఆమోదింప చేసే ప్రయత్నంలో అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వార్తలతో ఉమ్మడి జిల్లా వాసుల్లోనూ కలవరం మొదలైంది. ఇప్పటికే అక్కడ విద్యనభ్యసిస్తున్న పలువురు విద్యార్థులతో పాటు ఇక్కడి వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథ్స్ తదితర సబ్జెక్టులను స్టెమ్‌గా పిలుస్తారు. ఈ రంగాల్లోని విద్యార్థులు పీజీ అనంతరం ఓపీటీ పేరిట మూడేళ్లపాటు అక్కడే ఉండి ఈ వ్యవధిలోనే ఉపాధి అవకాశాలను వెతుక్కుని అక్కడే స్థిరపడేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ బిల్లు ఆమోదమైతే ఇలాంటివారు భారతదేశానికి తిరిగి రావాల్సి ఉంటుంది. ఇక వీసా నిబంధనలు కూడా కఠినతరం చేయడంతో అమెరికా ఆశలు నెరవేరేలా లేవని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రపంచదేశాల నుంచి భారీగా అమెరికాకు వలసలు పెరగడమే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.

హెచ్ వన్ బీ, గ్రీన్ కార్డులున్నా..

హెచ్ వన్ బీ, గ్రీన్ కార్డుల వ్యవస్థను కూడా ప్రక్షాళన చేసి మరింత కఠినతరం చేసే పనిలో ట్రంప్ ఉన్నట్లు చెబుతున్నారు. విదేశాల నుంచి తమ దేశానికి వచ్చే వారిపై పలు రకాల ఆంక్షలు విధించనున్నట్లు తెలుస్తోంది. అన్ని రకాల వడపోత తర్వాతే అమెరికా ప్రవేశం చేసేలా నిబంధనలు అమలులోకి తెచ్చేలా ట్రంప్ సర్కారు కఠినంగా ఈ సంస్కరణలు చేపడుతున్నట్లు పలువురు ఎన్నారైలు అభిప్రాయపడుతున్నారు.

వలసలు పెరిగినందునే..



వివిధ రకాల సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇతర ఎంఎన్సీ సంస్థల్లో ప్రపంచ దేశాల నుంచి లక్షలాదిమంది యువత అమెరికా దేశం వైపు వలస వస్తుండటంతోనే అక్కడి ప్రభుత్వం ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతమున్న వీసా, ఓపీటీ నిబంధనలు సంస్కరించేందుకు సమాయత్తమవుతోంది. రానున్న రోజుల్లో అమెరికా దేశానికి వచ్చే వారికి కఠిన నిబంధనలు అమలులోకి వస్తాయి.

– బీ మల్లేశ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, సిలికాన్ వ్యాలీ, యూఎస్‌ఏ

నిరాశపర్చిన మామిడి


రాలిపోయిన మామిడి కాయలు


లంబడిపల్లి సమీపంలో కాత లేని మామిడి చెట్టు

- ఈసారి పూత, కాత తక్కువే
- తెగుళ్లతో రాలుతున్న కాయలు
- ఆందోళనలో కౌలు రైతులు

చెన్నూర్‌రూరల్: వాతావరణ మార్పులతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈసారి పూత, కాత సరిగా రాలేదు. కొద్దిపాటిగా కాసిన చోట తెగుళ్ల ఆశించగా కాయలు నల్లగా మారి రాలి పోతున్నాయి. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 18వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. చెన్నూర్, కోటపల్లి, భీమారం, నెన్నెల, బెల్లంపల్లి మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో తోటలున్నాయి. కొందరు రైతులు మామిడి తోటలను కౌలుకు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 8వేల మంది కౌలు రైతులున్నట్లు అంచనా. వీరు ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు కౌలు చెల్లిస్తారు. రెండు లేదా మూడేళ్లపాటు తోటల యజమానులకు ముందుగానే కౌలు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కౌలు రైతులు జూలై, ఆగస్టు నుంచే ముందస్తు యాజమాన్య పద్ధతులు పాటిస్తారు. మందులు స్ప్రే చేస్తారు. ఇందుకు రూ.వేలల్లో పెట్టుబడి పెడతారు. ప్రకృతి కరుణిస్తే ఎకరం మామిడి తోటలో సుమారు మూడు టన్నుల దిగుబడి వస్తుంది. ఈసారి ఐదు క్వింటాళ్ల దిగుబడి కూడా రాని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు గాలిదుమారాలు, అకాల వర్షాలకు ఎక్కడో ఓ దగ్గర కాసిన కాయలు కూడా రాలి పోతున్నాయని, కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాయలు రాలి పోతున్నయ్



మామిడి చెట్లకు ఈసారి పూత ఆలస్యంగా వచ్చింది. వచ్చిన పూత నిలువక కాత సరిగా రాలేదు. గతేడాది కాయలోపల పురుగు ఆశించి నష్టపోయినం. ఈసారి ఎక్కడో ఒక చెట్టుకు కాయలు కాసినయ్. కానీ.. వాతావరణ మార్పులతో పురుగు ఆశించి అవి కూడా రాలి పోతున్నయ్.

– అట్టెం రాజబాపు, రైతు, చెన్నూర్

తీవ్రంగా నష్టపోతున్నం



ఈసారి మామిడి కాత సరిగా లేదు. తోటలు కౌలుకు తీసుకుని అన్ని రకాల మందులు స్ప్రే చేసినం. అయినా పూత తక్కువగా వచ్చింది. వచ్చిన పూత కూడా రాలిపోయింది. ఎక్కడో ఓ దగ్గర కాత కాసినా గాలి దుమారాలు, అకాల వర్షాలకు అవి కూడా నేల రాలినయ్. ఈసారి దిగుబడి తగ్గి తీవ్రంగా నష్ట పోతున్నం.

– మడె అర్జయ్య, కౌలు రైతు, సంకారం

పంతులమ్మ.. ఇదేమిటమ్మ!

- నిబంధనలకు విరుద్ధంగా స్పాట్ విధులు
- మంచిర్యాలకు బదులు.. ఆదిలాబాద్‌లో డ్యూటీ

ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలఅర్బన్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్‌లో కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా ఓ ఉపాధ్యాయురాలు తనకు కేటాయించిన జిల్లాలో కాకుండా ఆదిలాబాద్‌లో విధులకు హాజరవుతున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఈజ్‌గాం పాఠశాలలో గణితం బోధిస్తున్న ఓ టీచర్‌కు మంచిర్యాలలో స్పాట్ డ్యూటీ కేటాయించారు. పాఠశాల నుంచి రిలీవ్ అయిన ఉపాధ్యాయురాలు మంచిర్యాల ఎస్సెస్సీ స్పాట్ కేంద్రంలో రిపోర్టు చేయాల్సి ఉండగా, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న స్పాట్ కేంద్రంలో విధుల్లో చేరారు. అధికారులను బురిడీ కొట్టించి స్పాట్‌కు హాజరు కావడంపై పలువురు ఉపాధ్యాయులు హైరానా చెందారు. అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. గత రెండేళ్లుగా సదరు టీచర్ నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడే విధులు నిర్వహిస్తున్నట్లు పలువురు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ విషయమై ఆదిలాబాద్ డీఈవో శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా.. ఆమె స్పాట్ డ్యూటీలకు హాజరు కాకుండా చూస్తామని తెలిపారు. సదరు టీచర్‌తోపాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులు అనుభవం లేకపోయినప్పటికీ పదో తరగతి మూల్యాంకనం విధులకు హాజరవుతున్నట్లు సమాచారం. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం చేయాలంటే కనీసం మూడేళ్లపాటు పదో తరగతి విద్యార్థులకు బోధించాల్సి ఉంటుంది. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ముగ్గురు ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా స్పాట్‌కు హాజరవుతున్నట్లు చెబుతున్నారు. కాగా, మంచిర్యాలలో విధులకు హాజరు కావాల్సిన ఉపాధ్యాయురాలు ఆదిలాబాద్‌లో హాజరు కావడంపై మంచిర్యాల డీఈవో యాదయ్యను సంప్రదించగా.. విచారణ చేపట్టి చర్యలు (నోటీసులు జారీ) తీసుకుంటామని తెలిపారు.

ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీలో స్వదేశ్‌కు స్థానం


స్వదేశ్ పర్కిపండ్ల

నిర్మల్‌ఖిల్లా: గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీపై అధ్యయనానికి గురువారం ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీలో నిర్మల్ జిల్లా వాసికి చోటు దక్కింది. సారంగపూర్ మండలం తాండ్ర గ్రామానికి చెందిన స్వదేశ్ పరికిపండ్ల ప్రవాసీమిత్ర కార్మిక సంఘం, గల్ఫ్ జేఏసీ పక్షాన దశాబ్దకాలంపైగా పోరాటం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఏర్పాటు చేసిన కమిటీలో సలహా సభ్యుడిగా స్వదేశ్‌కు చోటు దక్కింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ కమిటీ చైర్మన్ రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ అధికారి డాక్టర్ బీఎం వినోద్ కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు గల్ఫ్ దేశాల్లోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో గల్ఫ్ కార్మికుల సంక్షేమ పథకాలపై అధ్యయనం చేయనున్నారు. కమిటీ నివేదిక ఆధారంగా సమగ్ర ఎన్నారై పాలసీ రూపకల్పన, సంక్షేమ బోర్డు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

విద్యుదాఘాతంతో రైతు కూలీ మృతి


లింగయ్య (ఫైల్)

చెన్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన కర్ణాల లింగయ్య (42) అనే రైతు కూలీ గురువారం విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బడికెల లచ్చయ్య పంట పొలం వద్ద బోరుకు అమర్చిన విద్యుత్ మోటర్ కాలిపోయింది. మరమ్మతు అనంతరం బోరులోకి మోటర్ అమర్చేందుకు కర్ణాల లింగయ్యతోపాటు పొంతెపు రంజిత్, దాద స్వామి, అందె రమేశ్ వెళ్లారు. బోరులో విద్యుత్ మోటర్ అమర్చిన అనంతరం కర్ణాల లింగయ్య భుజంపై ఇనుప పైపు పెట్టుకుని ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో పైనున్న 11కేవీ విద్యుత్ తీగలు పైపునకు తాకడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. లింగయ్యను కాపాడేందుకు ప్రయత్నించగా మిగతావారికీ స్వల్ప గాయాలయ్యాయి. లింగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై వెంకటేశ్వర్‌రావు, కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ పరిశీలించారు. మృతుడికి భార్య పరిమళ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పరిమళ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పల్లంగూడలో యువకుడు..


కిషన్ (ఫైల్)

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి పల్లంగూడకు చెందిన వెడమ కిషన్ (34) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్ ఈ నెల 9న ఉదయం 10గంటలకు ఇంటి నుంచి పని నిమిత్తం బయటకు వెళ్లి రాత్రి 9 గంటల సమయంలో వచ్చాడు. స్నానానికి నీళ్లు పట్టుకునేందుకు ఇంట్లోని బావి దగ్గరి మోటర్ వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, అందరితో కలివిడిగా ఉండి ఆదివాసీ ఉద్యమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించే కిషన్ మృతిని ఆదివాసీ సంఘాల నాయకులు తట్టుకోలేకపోయారు. ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

గోదావరిలో మునిగి బాలుడి మృతి


శశికుమార్ మృతదేహం

దండేపల్లి: కళ్లముందే ఉన్నట్టుండి ఒక్కసారిగా విగతజీవిగా మారిన బాలుడిని చూసిన తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగారు. ఈ ఘటన మండలంలోని కన్నెపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్తె భీమయ్య కుమారుడు శశికుమార్‌వర్మ (7) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. 11 రోజులపాటు ఆంజనేయస్వామికి అతను ఉపవాస దీక్ష చేస్తున్నాడు. ఈక్రమంలో గురువారం పాఠశాలకు వెళ్లి వచ్చిన శశికుమార్‌వర్మ సాయంత్రం గ్రామానికి చెందిన హనుమాన్ దీక్షాస్వాములతో కలిసి గూడెం గోదావరి నదిలో స్నానానికి వెళ్లాడు. నదిలో స్నానం చేసే సమయంలో ప్రమాదవశాత్తు జారి నీటిలో మునిగి చనిపోయాడు. బాలుడి మృతితో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


రాజు (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని బోయిడోళ్ల రాజు (32) మృతి చెందాడు. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన రాజు గురువారం వేకువజామున వానల్‌పాడ్ గ్రామం నుంచి తిమ్మాపూర్ వైపునకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రాజు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంస్మరణ సభకు నిధులివ్వాలి

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్ గ్రామ సమీపంలోని అమరవీరుల స్తూపం వద్ద సంస్మరణ సభ నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని ఇంద్రవెల్లి అమరవీరుల ఆశయ సాధన కమిటీ చైర్మన్ కనక తులసీరాం కోరారు. ఈ మేరకు గురువారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను పీవో క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి స్తూపం వద్ద ప్రతీ సంవత్సరంలో ఏప్రిల్ 20న సంస్మరణ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. సభలో అధికసంఖ్యలో ఆదివాసీ ప్రజలు, నాయకులు పాల్గొని నివాళులర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సభ నిర్వహణకు ఐటీడీఏ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాలని పీవోను కోరారు. స్పందించిన పీవో త్వరలోనే కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహిస్తానని పేర్కొన్నట్లు తులసీరాం తెలిపారు. అనంతరం పీవో కమిటీ చైర్మన్ తులసీరాంను సన్మానించారు. తుడుం దెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు, రగల్ జెండా ప్రధాన కార్యదర్శి కోట్నాక్ జారిక్‌రావు, శ్యాంరావు, చిత్రు తదితరులున్నారు.

తుమ్మిడిహెట్టి వద్దే ‘ప్రాణహిత’ నిర్మించాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్/కౌటాల: సిర్పూర్ నియోజకవర్గంలోని తుమ్మిడిహెట్టి వద్దే ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మించాలని ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, తెలంగాణ జల సాధన సమితి అధ్యక్షుడు నైనాల గోవర్ధన్ రాష్ట్ర సాగునీరు, సివిల్ సప్లయ్‌శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని జలసౌధ భవనంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. తుమ్మిడిహెట్టి వద్దనే ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మించాలని, దీంతో ఐదు నియోజకవర్గాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. హైదరాబాద్ నగరానికి నీరు సరఫరా చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మిడిహెట్టి వద్దనే ప్రాజెక్ట్ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రతాప్ తదితరులున్నారు.

మట్కా నిర్వాహకులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ నజ్జు అనే మహిళతో పాటు మరో ముగ్గురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఖుర్షీద్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తుండగా నజ్జుతో పాటు ఇదే ప్రాంతానికి చెందిన షేక్ షాహిన్, షేక్ హుస్సేన్, నజీమొద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వీరి నుంచి రూ.1,940, సెల్‌ఫోన్లు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సదరు మహిళ మట్కా నిర్వహిస్తుండగా ఆమె వద్ద షేక్‌హుస్సేన్, షేక్ షాహిన్ డబ్బులు చెల్లించినట్లు వివరించారు. ఆమె మట్కా నిర్వాహకుడు నజీమొద్దీన్‌కు డబ్బులు పంపుతున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం


శాదఫ్ (ఫైల్)


దీపక్ (ఫైల్)

ఇంద్రవెల్లి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి మండలంలోని దనోరా (బీ) సమీపంలోని పిప్రి గ్రామ చౌక్ వద్ద ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. 108 అంబులెన్స్ పైలట్ అశోక్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వ్యాపారి చింతవర్ దీపక్ (58) జాలంతండా గ్రామానికి చెందిన తన మునిం నిస్తే అజయ్‌తో కలిసి ఆదిలాబాద్ నుంచి ఇంద్రవెల్లి వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. దనోరా (బీ) గ్రామానికి చెందిన షేక్ శాదఫ్ (19) ముత్నూర్ నుంచి ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వీరి ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చింతవర్ దీపక్, షేక్ శాదఫ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. జాలంతండాకు చెందిన నిస్తే అజయ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇతడిని స్థానికులు వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సాయన్న ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

ఫాంహౌస్ స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: ‘ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం’ శీర్షికన గురువారం ‘సాక్షి’లో ప్రచురించిన కథనానికి తహసీల్దార్ సతీశ్‌కుమార్ స్పందించారు. గురువారం సర్వేయర్ కృష్ణతో కలిసి 364 సర్వే నంబర్‌లోని భూమి వద్దకు వచ్చారు. ఫాంహౌస్ వద్దకు వెళ్లి సర్వే మ్యాపు, రికార్డులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. 364 సర్వే నంబర్‌లో ఎకరం 30గుంటల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. పూర్తి రికార్డుల పరిశీలన అనంతరం హద్దులు గుర్తిస్తామని పేర్కొన్నారు. అలాగే స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కన గల పాత కేకే-5 సీఎస్పీ రోడ్డు పక్కనున్న ప్రభుత్వ భూమి వద్దకు ఆర్ఐ గణపతితో వెళ్లి పిచ్చి మొక్కలు తొలగింపజేశారు. ప్రభుత్వ భూమిని ఆనుకుని సింగరేణి భూమి ఉందని తెలిపారు. గతంలో సింగరేణి ప్రభుత్వానికి ఎంత భూమి అప్పగించిందో రికార్డులు పరిశీలిస్తామని పేర్కొన్నారు. అనంతరం హద్దులను గుర్తించి స్వాధీనం చేసుకుని కంచె వేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూమిలోని నిర్మాణాల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.


ప్రభుత్వ భూమిని చదును చేయిస్తున్న తహసీల్దార్

దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆశయ్య

వేమనపల్లి: గ్రామాల్లో పెత్తందారుల దౌర్జన్యాలకు ప్రభుత్వ యంత్రాంగం అడ్డుకట్ట వేయాలని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బాగాల రాజన్న అధ్యక్షతన నిర్వహించిన ఆదివాసీ, దళిత సంఘాల రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరై మాట్లాడారు. మండలంలోని మంగెనపల్లి గ్రామంలో పెత్తందారి వేధింపులకు ఆదివాసీ బిడ్డ నాయిని కన్నయ్య మృత్యువాత పడితే స్థానిక ఎమ్మెల్యే, ఏ అధికారి బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం దారుణమన్నారు. కన్నయ్య కుటుంబానికి రూ.50లక్షల పరిహారం, అతడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, ఐదెకరాల భూమి, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్ అందజేయాలన్నారు. కన్నయ్య మృతికి కారకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. కన్నయ్య కుటుంబానికి తెలియకుండా సీలింగ్ పట్టా భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి పట్టాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి, బోధి సత్వ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వలీ హైదర్, వివిధ సంఘాల నాయకులు బాపు, రవి, ఎల్లయ్య, రవి, శంకర్, అశోక్ పాల్గొన్నారు.